
# మనుషులను, మనసులను

# కలిపేదే కవిత్వం

- **దక్షిణ భారత కవిత్వ ఉత్సవంలో నందిని సిధారెడ్డి**



దక్షిణ భారత కవిత్వ ఉత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న శిర్పి బాలసుబ్రమణ్యం. పక్కన శివారెడ్డి, నందిని సిధారెడ్డి, కె.శ్రీనివాసరావు, హరికృష్ణ

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: మనుషుల్ని, మనసుల్ని కలిపే శక్తి ఒక్క కవిత్వానికే ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో దక్షిణ భారత కవిత్వ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖ కవులు హాజరై ఆయా ప్రాంతాల కవితా వికాసాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. ఈ సమ్మేళనం ద్వారా దక్షిణ భారతదేశంలోని ఆయా ప్రాంతాల సంస్కృతి, ప్రజల జీవన విధానాలు అర్థం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. కవులు, సాహితీవేత్తల ఆలోచనలకు పదును పెట్టడానికి, ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి ఇలాంటి వేదికలు అవసరమని అభిప్రాయపడ్డారు. కేంద్ర సాహిత్య అకాడమీ సహకరిస్తే తెలంగాణ సాహిత్య అకాడమీ ఇలాంటి కవితా సమ్మేళనాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి కన్వీనర్, ప్రముఖ కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రెండు, మూడు నెలలకోసారి ఇలాంటి సదస్సులు జరగాలని ఆకాంక్షించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.కె.శ్రీనివాసరావు స్వాగతం పలుకుతూ.. వేల సంవత్సరాల కిందటే భారతదేశంలో కవిత్వం ఉందన్నారు. సమావేశంలో సాహిత్య అకాడమీ తమిళ సలహామండలి కన్వీనర్ శిర్పి బాలసుబ్రమణ్యం, కన్నడ సలహామండలి కన్వీనర్ సిద్ధ లింగయ్య, మలయాళ సలహామండలి కన్వీనర్ ప్రభావర్మలతోపాటు కవులు ఆశారాజు (తెలుగు), అనసూయ కాంబ్లే (కన్నడ), సెబాస్టియన్ (మలయాళం), బి.మీనాక్షి సుందరం (తమిళం), ప్రసాదమూర్తి (తెలుగు), శిఖామణి (తెలుగు), విక్రమ్ విసాజీ (కన్నడ), జినేష్‌కుమార్ ఎరమం (మలయాళం), శక్తిజ్యోతి (తమిళం), విమల (తెలుగు) తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య వీచిక..

# ఈ సమైక్య వేదిక

- ఒకే వేదికపైకి దక్షిణ భారత కవులు
- ఈ సారి ప్రచురణలకు పెద్దపీట వేయాలని నిర్ణయం



సమ్మేళనానికి హాజరైన వివిధ రాష్ట్రాల కవులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఆయా రాష్ట్రాల్లో అక్కడి భాషలకు సంబంధించిన కవిత్వం, సాహిత్యంపై సదస్సులు నిర్వహించుకోవడం సర్వసాధారణం. ఆయా భాషల కవులు ఒక వేదికపైకి రావడం, కలవడం అరుదుగా జరుగుతుంది. అలాంటి ప్రయత్నానికి భాగ్యనగరం వేదికైంది. భారతీయ భాషల్లోని సాహిత్యానికి సహకారం, పోషణ, ప్రోత్సాహం కల్పించాలనే సంకల్పంతో ఆవిర్భవించిన కేంద్ర సాహిత్య అకాడమి జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో సాహిత్యం, కవితా సదస్సులు, కార్యశాలలు, సమావేశాలను నిర్వహిస్తూ.. పరిశోధకులు, రచయితలు, కవులకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖతో అకాడమి 'దక్షిణ భారత కవిత్వ ఉత్సవాన్ని' ఏర్పాటు చేసింది. దక్షిణ ప్రాంతంలోని భాష, సంస్కృతి, సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి చక్కటి వేదికైంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాల కవులు పాల్గొని తమ ప్రాంతాల సాహిత్య ప్రతిభావిశేషాన్ని ఆవిష్కరించారు. ఆ కవికోవిదులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

**పాల్గొన్న కవులు..** కన్నడ సలహామండలి కన్వీనర్ సిద్ధలింగయ్య, అధ్యక్షతన జరిగిన మొదటి సదస్సులో ఆశారాజు (తెలుగు), అనసూయ కంబాల్ (కన్నడ), సెబాస్టియన్ (మలయాళం), బి.మీనాక్షి సుందరమ్ (తమిళం), ప్రసాదమూర్తి (తెలుగు) పాల్గొన్నారు. మలయాళం సలహామండలి కన్వీనర్ అధ్యక్షతన జరిగిన రెండో సదస్సులో శిఖామణి (తెలుగు), విక్రమ్ విసంజి (కన్నడ), జినేష్‌కుమార్ (మలయాళం), శక్తిజ్యోతి (తమిళం), విమల (తెలుగు) పాల్గొన్నారు.

**అనువాద లక్ష్యాలు..**

రెండు తెలుగురాష్ట్రాల్లో సాహిత్యపరమైన అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రముఖ కవి, సాహిత్య అకాడమి, తెలుగు సలహా మండలి కన్వీనర్ కె.శివారెడ్డి, సాహిత్య అకాడమి జనరల్ కౌన్సిల్ సభ్యులు వాసిరెడ్డి నవీన్ తెలిపారు. మార్చి 17న కొత్తగూడెంలో 'గాంధీ ఇన్‌ఫ్లూయెన్స్' వంటి ఆత్మకథలపై సదస్సు వేయబోతున్నారు. దాశరథి ఆత్మకథను ఆంగ్లంలో అనువదించడానికి అన్ని ఇటీవలే ఓ ప్రముఖ సాహితీవేత్త ముందుకొచ్చారు. తెలుగు నుంచి పాతిక కథలు తమిళంలోకి, తమిళంలోని పాతిక కథలు తెలుగులో ఈ ఏడాది అనువదించేలా ప్రణాళిక వేసుకున్నారు. 20 కథలు తెలుగు నుంచి అస్సామీ, మణిపురి, మలయాళంలోకి అనువదించడానికి పనులు మొదలయ్యాయి. ఈ మధ్య కాలంలో నిర్వహించిన సదస్సుల్లో పుస్తక ప్రచురణలకు ప్రాధాన్యం ఇవ్వాలని అకాడమి నిర్ణయించింది.

## సామాజిక మాధ్యమాల ఊతం

– సిద్ధలింగయ్య, కన్నడ కవి

ఇటీవల సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన తరువాత యువ కవులు, సాహితీవేత్తలతో పాటు పోటీపడుతూ సుప్రసిద్ధ కవులు, సాహితీవేత్తలు ఒక ఉద్యమంగా రచనలు చేస్తూ.. ఫేస్‌బుక్ ట్విటర్ వంటి మాధ్యమాల ద్వారా విశ్వవ్యాప్తం చేయడానికి కృషి చేస్తున్నారు. ఇది మంచిదే కానీ.. సామాజిక మాధ్యమాలను నిర్వహించడం కూడా సామాజిక బాధ్యతగా భావించాలి.

## ఏకీకృత భావనకు వేదిక

– మామిడి హరికృష్ణ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంచాలకులు

భారతీయ సాహిత్యానికి జ్ఞానపీఠ పురస్కారాలు కొలమానమైతే ఆ పురస్కారాలను ఎక్కువగా పొందింది కర్ణాటక, తమిళ, మలయాళీ సోదరులూ నిరూపించుకున్నారు. తెలుగుకు మూడు జ్ఞానపీఠాలు వచ్చాయి. దక్షిణ భారతంలో వస్తున్న కవిత్వం, సాహిత్యంలో అత్యుత్తమ విలువలతో వస్తోంది. సాహిత్యంతోనే సమైక్యతా భావాన్ని సాధించే అవకాశం ఉంది. ఏకీకృత భావన భారతీయ, భారత సమైక్యతను పెంపొందించడానికి సాహిత్యం ద్వారా జరుగుతున్న ప్రయత్నమే ఇది.

## ప్రయోగాలు తెలుసుకునే అవకాశం

2014-15 సంవత్సరాల మధ్య దక్షిణ భారత సదస్సు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు కవిత సదస్సు నిర్వహిస్తున్నారు. దక్షిణాది భాషల కవులను ఒకే వేదిక మీదకు తీసుకురావడం ఒకెత్తయితే.. ఆ భాషల్లో వస్తున్న రచనల్లో మార్పులు తెలుసుకోవడం ఈ యత్నం ముఖ్య ఉద్దేశం. అందుకే ఆయా భాషల్లో ప్రాంతీయ మండళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఏప్రిల్ చివరి వారంలో దక్షిణ భారత యువ రచయితల సదస్సు నిర్వహించనున్నట్లు సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. దక్షిణ భారతానికి సంబంధించి తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో అంతా ఒకటే కుటుంబంగా భావించే వాతావరణం ఉంటుంది. ఈ భాషల్లోని సాహిత్యం, సంస్కృతి, ప్రజల జీవన విధానంలోగానీ కొన్ని పోలికలు ఉంటాయి. ఈ ఉమ్మడి సంస్కృతి పరంపరను అర్థం చేసుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడిందని తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు నందిని సిధారెడ్డి అంటున్నారు.

# పురోగమనానికి ఇంధనం.. కవిత్వం

## దక్షిణ భారత కవిత్వ ఉత్సవంలో కవులు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నందిని సిధారెడ్డి, కె.శివారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సమాజ పురోగమనానికి కవిత్వం ఇంధనం వంటిదని పలువురు కవులు అభిప్రాయపడ్డారు. సంఘ సంస్కరణోద్యమం, స్వాతంత్ర్య పోరాటంలో కవిత్వం ఒక ఆయుధంగా నిలిచిందన్నారు. కవులు, రచయితల సామాజిక స్పృహ, ఆకాంక్ష వేరైనా వారి అంతిమ లక్ష్యం సమాజహితమేనని తెలిపారు. నేటి కవులు కూడా తమ కవిత్వాలను పుస్తకాల ద్వారా తీసుకొస్తున్నప్పటికీ వాటిని చదివేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన 'దక్షిణ భారత కవిత్వ ఉత్సవం'లో పలువురు కవులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దక్షిణ భారతీయ భాషల మధ్య సాన్నిహిత్యం పెరగడానికి, ఆలోచనలు పంచుకోవడానికి ఈ ఉత్సవం ప్రధాన వేదికగా నిలుస్తోందని రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి కొనియాడారు. జాతీయ సాహిత్య సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్ర సాహిత్య అకాడమీ సిద్ధంగా ఉందని, అందుకు కేంద్ర సాహిత్య అకాడమీ సహకరించాల్సిందిగా కోరారు. కవిత్వంలోని ప్రతి అక్షరం వెనుక ఆయా ప్రాంతాల భౌగోళిక స్వరూపం దాగుంటుందని, అదే చాలా కీలకమని సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి కన్వీనర్ కె.శివారెడ్డి అన్నారు. ఒక భాషకు సంబంధించిన సాహిత్య, సాంస్కృతిక విషయాలు, సమకాలీన రచనా శైలి, ఇతివృత్తాలు తదితర అంశాలు మరొక భాష వారు తెలుసుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో నేషనల్, రీజనల్ లిటరరీ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు తెలిపారు. తమిళనాడులో సాహిత్యానికి ఆదరణ అంతంత మాత్రమేనని, అందుకు రాష్ట్ర ప్రభుత్వంలో సాహిత్యాభిమానులు లేకపోవడమే ప్రధాన కారణమని సాహిత్య అకాడమీ తమిళ సలహామండలి కన్వీనర్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కవిత్వం ఉజ్వలంగా ఉందని, కవితా వస్తువుతో రాజీపడకుండా, ప్రగతిశీల కవిత్వాన్ని రాస్తున్న వారెందరో ఉన్నారని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దేవీప్రియ అన్నారు. ఈ సందర్భంగా అతిథులకు భాష, సాంస్కృతిక శాఖ ప్రచురించిన "తెలంగాణ హార్వెస్ట్", "కల్చర్ ఆఫ్ ఎమినిటీ", "ఎకో పోయెమ్స్", "కల్చర్ ఎట్ తెలంగాణ" పుస్తకాలను మామిడి హరికృష్ణ బహూకరించారు.